# నెత్తురు చుక్కలు

ఏనాడో పల్లె అంతా పాకిన పుకారు, పెంటయ్య చెవిలో ఈనాడే పడింది. ఈ వూర్లో పానకాలరావు దగ్గర ఏ విషయం గుప్తంగా ఉండగలుగుతుంది? పుకారు బయలుదేరిననాడే విన్నాడు.

పానకాలరావుకు, పెంటయ్యకు భేదం ఏమిటంటే–

పానకాలరావు భూకామందు.

పెంటయ్య సర్వస్వం అతనికి అర్పించిన నౌకరు.

ఇద్దరిలోనూ పోలికలు లేకపోలేదు. ఇద్దరిదీ ఇంచుమించు ఒకటే వయసు. ఇద్దరికీ పెళ్ళాలు లేరు. పెళ్ళాం చావకూడదని మొక్కిన పెంటయ్య పెళ్ళాన్ని దక్కించుకోలేకపోయాడు. పెళ్ళాంచస్తే మంచిదని పానకాలరావు అనుకోగానే పెళ్ళాం చచ్చింది.

పానకాలరావు కళ్ళతో కరుణ చూపించి, మాటలతో అమృతం ఒలికించి, గుండెతో ఎదుటివాణ్ణి మొండిచెయ్యగల సమర్థుడు. అతని యోచనలో సాహసం ఉంటుందంటారు. ఈ పుకారు పరిణామం ఊహించాడు కాబట్టి చెయ్యవలసిన బందోబస్తు చేసుకున్నాడు.

ఒకనాడు పుట్టిన పుకారు ఈనాడు నిజమని తేలిపోయింది. ఈ నాటకంలోని ప్రధాన పాత్రల్లో ఒక పాత్ర గైరమ్మ.

దీపం ఎరగని ఇంట్లో ఒకమూల దెయ్యంలా కూర్చోక, అందరికళ్ళూ పడ్డ చందమామలా పెరుగుతూ వచ్చింది. పాలులా పొంగిన సింగారం అంచులు దాటి ఒలికిపోలేదు. కన్నులుదాటిన సొగసు కళ్లెమై ఏ యువకుణ్ణి లాగుకోలేదు. నలుపైనా, నీటుగా మెరిసిన చెక్కిళ్ళపై ఎవరి చెయ్యి పడలేదు.

లోకాన్ని ఏలేవా డొక్కడే, ఆడదాన్ని ఏలే వాడొక్కడేనని నమ్ముకున్న గైరమ్మని ఇలా రంగంలోనికి ఈడ్చినవా డెవడు?

మరెవడో కాదు. జుత్తుపెంచి హిప్పీలా తయారయినవాడు. దళసరి కళ్ళద్దాలతో దిగజారుతున్న దృష్టిని పెంచుకొని, ఈ గైరమ్మను, ఈ చెక్కిన బొమ్మను, ఊరిని అడివిచేసి, ప్రజను జంతువులను చేసి అల్లరిచేసి, అనుభవించి పట్నం పోయాడట!

గైరమ్మ నౌకరు పెంటయ్య కూతురు. కథానాయకుడు పానకాలరావు ప్రియపుత్రుడు. పట్నంలో చదువుకుంటున్నాడు. ఇలా ఏనాడయినా జరుగుతుందని

ఊహించని పెంటయ్యమీద ఈ వార్త పిడుగులా పడింది. కూతురు ఏడుపే జవాబిచ్చింది. బుగత దగ్గరకు పరుగెత్తాడు.

"ఏటీ అన్యాయం? ఏటీ గోరం?" అంటే, పానకాలరావు అలవాటుకొద్దీ చిరునగవే ఒలకపోశాడు.

"నవ్వుతన్నారా, బాబూ? నవ్వండి. మీకింత పరపతిచ్చిన బూదేవి మీ నవ్వుతో పండనేదు. నా సెమటతో పండినాది. మీకింద సేసింది ఒక పసివికింద సేస్తె పాలిచ్చి పెంచేది."

"ఏమిట్రోయ్, పెంటయ్యా, జెర్రిపోతు నాగుపామెప్పుడయ్యిందిరా? గడ్డిపరకలు పల్లేరుకాయల్ని ఎప్పుడు పండిస్తున్నాయిరా? కొమ్ము విరిగిన దుక్కి ఎద్దుకు పొడిచే సాహసం ఎలా గొచ్చిందిరా?" పానకాలరావు నవ్వుతూ వడ్డించాడు.

"బందాలతో నన్ను కట్టేసినారు. నా ఒక్కగానొక్క కూతుర్ని కట్టిపెట్టేస్తారా? మీకిది సబబే, బాబూ?"

"అన్ని హక్కులూ పొందడానికే పెళ్ళానికి మొగుడు తిండి పెడతాడురా! నీ కుటుంబాన్నంతా ఎందుకు పోషించానురా? నీ పెళ్ళాం జబ్బుకి ఇచ్చిన అప్పులకి ఎంత వడ్డీ కట్టావురా?"

"అంత వెట్టిచాకిరీ చెయ్యించుకున్నారు. ఇంత గెంజిపోసినారు."

"నేను ఆ గంజి పొయ్యకపోతే వీథంట అడుక్కుని చచ్చేవారురా! ఏనాడూ పల్లెత్తి మాటాడనివాడివి ఈనాడు నీకేదో శని పట్టిందిరా! నా కివ్వవలసిన డబ్బిచ్చి వదిలెయిరా నా కొలువు."

"నా కూతురు సంగతి సెప్పండి ముందు."

"ఎవరూ? గైరమ్మా? ఏమైందిరా?"

"తమరిగారి అబ్బాయి..."

"నేనూ విన్నానురా. అవి పుకార్లురా. అందులో నిజం లేదురా."

"తమరు లేదన్నా, నిజం దాగదు. అది ఉత్తి అమాయకురాలు."

"ఈ కాకిగోలతో నీ కూతురు నా కోడలై పోదురా. శాంతించు. ఊం. చేతులు కట్టుకో. తల దించు. ఈ పని ఎవడు చేశాడో చెపుతాను. ఊం."

"తల దించాను. సేతులు కట్టుకున్నాడు. నిజం సెప్పండి."

"నేను చెప్పనురా. చెప్పలేనురా. వాణ్ణే పిలిపిస్తాను. ఉండు. ఒరే, చూడండి ఆ సత్తిగా డున్నాడేమో పిలుచుకురండి. సత్తిగాడు తెలుసు కదూ?"

"సత్తిగాడా? ముగ్గురు పిల్లల తండ్రి!"

"కక్కుర్తి అలాంటివాళ్ళే పడతారురా! ఎంగిలాకు విసరగానే పరుగెత్తే కుక్కలాంటివాడుకాదురా నా కొడుకు."

"బాబ్బాబు! ఏటీ గోరం? ఊరంతా మీ బాబే అంటుంటే తమరు సత్తిగాడిమీద ఏస్తున్నారు: ఏది నిజం? ఏది అబద్ధం? అసిరమ్మ తల్లీ..."

"అలా ఏడవకురా, పెంటయ్యా! ఏడిస్తే పనులైపోతాయా? నీతి సాలెగూడు లాంటిదిరా. అందులో పై అంతస్తులో ఉన్న మాలాంటివాళ్ళం చిక్కుకుంటాం గానీ, నీలాంటివాళ్ళు చిక్కుకో అక్కర్లేదురా. కడుపు నింపుకోడానికీ, మనసు

నింపుకోవడానికి చేసిన పనంతా నీతైనా పనేరా? పుట్టబోయే వాడి పీక నులపకు. మీ అంతస్థులో తల్లినీ, బిడ్డనీ చూసుకునేవాడు దొరుకుతాడులే. అదిగో – సత్తిగాడు. ఒరే సత్తిగా! ఊరంతా పుకారట. పాపం చేసిన గైరమ్మ పలకటం లేదు. చెప్పరా – ఊఁ చెప్పు."

"మీ ఉప్పుతిన్నా, నేరం నా నెత్తిన ఏసుకోలేను, బాబూ! నా కూతురు ఎదిగితే ఒక ఇంటిదాన్ని సెయ్యాలా? మచ్చ తెచ్చుకుంటే అంత యేగిరం సెరగదు, బాబూ!"

"ఒరే వెధవా! చేసినపాపం ఒప్పుకోకుండా నీతి కబుర్లాడుతున్నావా?"

"ఎవరి నీతి ఆలదగ్గరే ఉంటాది, బాబూ! ఒరే పెంటయ్యా! ఆ కళ్ళద్దాలబాబు ననుకుంటే పాపం! ఆ బాబు మాటల సరసుడు. ఈ బాబు – అతగాడి నాయన... ఇంతపనీ చేసినాడు."

"ఒరే సత్తి వెధవా! ఏమంటున్నావురా?" అరిచాడు పానకాలరావు.

"నీ కూతురు వయసుది నా కూతురు. నీకు నాయమా?" ఒక్క ఎగురు ఎగిరాడు పెంటయ్య.

సత్తెయ్య వాణ్ణి పట్టుకుని ఆపుతూ, "పిస్తోలున్నది. డబ్బుతో పిస్తోలు కొనేసినట్టు నాయాన్నీ కొనేస్తా ననుకుంటున్నాడు. ఆ రోజులు పోతున్నాయి. కొత్త రోజులు పాదం మోపాయి. పాదాలు గజ్జెలు కట్టుకుని కదలతన్నాయి. అయిగో, వస్తున్నాయి. పద... పద... ఎయ్ అడుగు... ముందుకు యెయ్‌రా... పెంటయ్యా! మనం మనుసులం రా... పశువులం కాము‌రా. ఎయ్యి..."

ఇంతలో ఎవరో వెనకనించి వచ్చి, "ఒరే పెంటయ్యా! గైరమ్మ నూతిలో గెంతేసిందిరా" అని అరిచాడు. ముందుకు పడుతున్న పాదాలు పగిలిన భూమిలోనికి పోయినట్లు కూలబడ్డాడు పెంటయ్య.

(విద్వాన్ విశ్వం సన్మాన సంచిక – అక్టోబరు, 1976)

* * *